


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

బోనాల వేడుకలకు స్పీకర్‌కు ఆహ్వానం

సైదాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రద్దాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైదాబాద్‌లో ఈనెల 28న బోనాలు, 29న ఘటాల ఊరేగింపునకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరుతూ ఉత్సవ కమిటీ సభ్యులు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆదివారం కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఘటాల ఊరేగింపులో పాల్గొంటానని స్పీకర్ చెప్పినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సుభాష్‌చందర్జీ, వర్కింగ్ ప్రెసిండెంట్ కదారు రాంకుమార్, ఉపాధ్యక్షులు సహదేవ్‌యాదవ్, సంగోది పరమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

లెనిన్‌నగర్‌లో 28న బోనాల జాతర

సరూర్‌నగర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌తో పాటు పరిసర కాలనీలు, బస్తీల్లో ఈనెల 28న (ఆదివారం) బోనాల జాతర జరుపుకోవాలని కట్టమైసమ్మ, రక్త మైసమ్మ ఆలయాల కమిటీ చైర్మన్ దిండు రాజు గౌడ్ తెలిపారు. ఆదివారం ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోనాల మహోత్సవాల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తామని, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రభు, రవినాయక్, కృష్ణ, మోహన్, భీమ్‌రాజ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి తదితరులు

శాకంబరి అవతారంలో అమ్మవారు

వనస్థలిపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలలో భాగంగా మన్సూరాబాద్‌లోని ప్రసిద్ధ పోచమ్మ ఆలయంలో అమ్మవారు శాకంబరి అవతారంలో దర్శనమిచ్చారు. అందులో భాగంగా మొదటి బోనాన్ని ఆదివారం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో సమర్పించారు. శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గా అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజాధికాలలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాంపల్లి శంకరయ్య కృష్ణ, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, శ్రీధరాచార్యులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కాలనీ సీనియర్ సిటిజన్స్ భవనాన్ని ప్రారంభిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట కాలనీల అభివృద్ధి పనులకు సహకరిస్తాం

- రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

కొత్తపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ కాలనీల అభివృద్ధి పనులకు సహకరిస్తామని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆర్టీసీ కాలనీ కమ్యూనిటీ హాల్ మూడవ అంతస్తులో రేవంత్‌రెడ్డి ఎంపీ నిధులతో నిర్మించిన సీనియర్ సిటిజన్స్ భవనాన్ని, కాలనీలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్‌నూ వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కొత్తపేట సత్యానగర్‌కాలనీ కార్యవర్గం ఎన్నిక

కొత్తపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సత్యానగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటయింది. ఆదివారం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సర్వసభ్య సమావేశం అనంతరం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం నూతన అధ్యక్షుడుగా జయప్రకాష్, ఉపాధ్యక్షులుగా టీ.భాస్కర్‌రెడ్డి, ఏ.మల్లికార్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా టీ.వీ.రమణ, ఉపప్రధాన కార్యదర్శిగా ఏ.నగేష్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.అంజిరెడ్డి, ఎం.రవీందర్‌రావు, నిర్వాహక కార్యదర్శులుగా పెంటయ్య, సీ.నటరాజ్, కోశాధికారిగా నరేష్, కార్యవర్గ సభ్యులుగా మాధవమూర్తి, కే.అనీల్‌కుమార్, జీ.శ్రీనివాసరావు, ధనుంజయ్, గౌరవ సలహాదారుగా రవికుమార్ వ్యవహరించనున్నారు.

చెరువును తలపిస్తున్న రహదారులు : కొప్పుల



వర్షపు నీరు నిలువ ఉన్న ప్రాంతాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

వనస్థలిపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ చెరువుల్లా తలపిస్తున్నాయని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని విజయవాడ జాతీయ రహదారి చింతలకుంట నుండి మధురానగర్‌కాలనీలోకి వర్షపునీరు రావడం వలన ఇబ్బంది పడుతున్న కాలనీవాసుల సమస్యను పరిశీలించేందుకు ఆదివారం ఆయన ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి చెరువుల్లా తలపిస్తున్న రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని మెయిన్ ట్రంక్ లైన్లకు మళ్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే తక్షణమే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. దీంతో డీఆర్ఎఫ్, మాన్సూన్ రిలీఫ్ టీం చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు.

లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కోశాధికారిగా చందునాయక్



నియామక పత్రం అందుకుంటున్న చందునాయక్

వనస్థలిపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కోశాధికారిగా బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన చందునాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లంబాడా కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులు రాంబాబునాయక్ ఇతర కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



నాదర్‌గుల్‌లో కలశపూజలో ఆలయ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న దిల్‌సుఖ్‌నగర్ సంస్థాన్ ఆవరణ



దిల్‌సుఖ్‌నగర్‌లో బాబాను దర్శించుకుంటున్న గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి



దిల్‌సుఖ్‌నగర్‌లో బాబా ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బేర బాలన్న తదితరులు



మీర్‌పేట్ సాయి పీఠంలో గోపాలకృష్ణానంద స్వామీజీతో కలిసి వేడుకల్లో ఏసీపీ కాశిరెడ్డి, కాంగ్రెస్ నేతలు భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని సాయిబాబా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని భక్తులు ఉదయం నుంచే బాబా ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్ షిరిడీ సాయి సంస్థాన్ ప్రత్యేక శోభను సంతరించుకుంది. ప్రత్యేక అలంకరణల నడుమ స్వర్ణ సింహాసనంపై కొలువుదీరిన సాయిబాబా దర్శనంతో భక్తులు.. భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. సాయినాథునికి ప్రీతిపాత్రమైన గురుపౌర్ణమిని ఆదివారం భక్తులు కనుల పండువగా జరుపుకున్నారు. సంస్థాన్ ముఖద్వారం, ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్చిలు, అలంకరణలతో గురుపౌర్ణమి మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచే బాబా దర్శనం కోసం భక్తులు సాయి సంస్థాన్ ముందు క్యూకట్టారు. ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరగడంతో, దేవాలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. భక్తుల భజనలు, సాయి నామస్మరణలతో దేవాలయ ప్రాంగణం మారుమ్రోగింది.



స్నేహపురి వేంకటేశ్వరాలయంలో నిర్వహించిన సుదర్శన హోమం

ప్రత్యేక క్యూలైన్‌లతో సులువైన దర్శనం..

బాబా దర్శనానికి వీఐపీలు వచ్చిన నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంస్థాన్ ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేయడంతో భక్తులు సులువుగా దర్శనం చేసుకున్నారు. వీఐపీలకు, అన్నదాతలను ప్రత్యేక మార్గం ద్వారా దర్శనానికి అనుమతించారు. అదేవిధంగా వృద్ధులు, చిన్నారులకు, వికలాంగులకు, సాధారణ భక్తులకు వేర్వేరుగా క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు.

సంస్థాన్ వద్ద పటిష్ట భద్రత..

వీఐపీలు, వేలాది మంది భక్తులు బాబా దర్శనానికి వస్తారని భావించిన పోలీసులు, సంస్థాన్ ట్రస్ట్ సభ్యులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సరూర్‌నగర్ పోలీసులు దేవస్థానం వద్ద పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. రెండు రోజులుగా సంస్థాన్ వద్ద గస్తీ ముమ్మరం చేసిన పోలీసులు ఆదివారం అడుగడుగునా సాయుధ బలగాలను మోహరించి పరిస్థితిని సమీక్షించారు. సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంకుమార్, ప్రధాన కార్యదర్శి రఘుకుమార్, మాజీ చైర్మన్‌లు గుండా మల్లయ్య, బచ్చు గంగాధర్, నర్సింహారావు, వనం యాదయ్య, ఉపాధ్యక్షులు కోడి రాజశేఖర్, కిరణ్‌కుమార్‌తో పాటు పలువురు ధర్మకర్తలు సంస్థాన్‌లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చాదర్‌ఘాట్: గురు పౌర్ణమిని పురస్కరించుకుని సలీంనగర్‌లోని సాయిసంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, దిల్‌సుఖ్‌నగర్‌లోని కనకదుర్గ ఆలయంలో ఛండీ హోమాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. షిరిడీ సాయినాథునికి ఉదయం కాకడ హారతి, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఛండీ హోమం నిర్వహించగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని కనకదుర్గ అమ్మవారికి ఉదయం అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, ప్రత్యేక పూజలతోపాటు ఛండీ హోమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లలో..

సరూర్‌నగర్: గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని భక్తులు ఉదయం నుంచే స్థానిక బాబా ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. నాదర్‌గుల్‌లోని సద్గురు సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ మర్రి అంజిరెడ్డి ఆధ్వర్యంలో 108 కలశ పూజతో పాటు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, బీజేపీ బడంగ్‌పేట్‌శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు పాలుబాయి అశోక్, నిమ్మల రవికాంత్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.

మీర్‌పేట్ సాయి పీఠంలో

మీర్‌పేట్ కార్పొరేషన్ ప్రశాంతిహిల్స్‌లోని సాయిబాబా పీఠంలో పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డి, మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కీసరి నాగరాజు, టీపీసీసీ ప్రతినిధులు దేప భాస్కర్‌రెడ్డి, సామిడి గోపాల్‌రెడ్డి తదితరులు వేడుకల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

కొత్తపేట: కొత్తపేట డివిజన్‌లోని కాలనీల్లో షిరిడీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక అర్చనలు విశేష పూజలు ఏర్పాటు చేశారు. గాయత్రీపురం, న్యూనాగోల్, ఎస్ఆర్ఎల్ కాలనీ, సత్యానగర్ కాలనీల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేయించారు. స్నేహపురి కాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరాలయంలో గురుపౌర్ణమి వేళ శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించారు. పరిసర కాలనీల భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



బాబాను దర్శించుకుంటున్న భక్తులు

వనస్థలిపురం: బాలాజీ నగర్‌లోని షిరిడీ సాయి బాబా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, జగన్‌గౌడ్, కృష్ణ, సుధాకర్‌రెడ్డి, నాగమణిరెడ్డి, భిక్షపతి, కరుణాకర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.



బాలాజీనగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, ఆలయ చైర్మన్ సందీప్‌రెడ్డి



దిల్‌సుఖ్‌నగర్‌లోని కనకదుర్గ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులు



సలీంనగర్‌లోని సాయి సంస్థాన్‌లో ఛండీహోమం

విద్యుత్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- టీజీఎస్‌పీడీసీఎల్ ఉద్యోగిపై కేసు నమోదు

కొత్తపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని టీజీఎస్‌పీడీసీఎల్ ఉద్యోగి ఒకరు రూ.19.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఒక మహిళ నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. మమతానగర్‌లో ఉండే నాగులపాటి శ్రావణి ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తుంది. మేడిపల్లి ప్రశాంత్‌నగర్‌కు చెందిన బండారపు కిరణ్ కుమార్(33) భువనగిరి టీజీఎస్‌పీడీసీఎల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడిని శ్రావణికి ఒక బంధువు పరిచయం చేశాడు. విద్యుత్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలతో అతడు ఆమెను నమ్మించి 2021 నుంచి 2023 వరకు మభ్యపెట్టి తరచూ ఆమె వద్ద, ఆమె తల్లి వద్దా పలు దఫాల్లో మొత్తం రూ. 19.50 లక్షలు వసూలు చేశాడు. పెద్దల సమక్షంలో అతడిని గట్టిగా అడిగితే కొన్నాళ్లకు నకిలీ నియామక పత్రం తెచ్చి ఆమెకు ఇచ్చాడు. అది నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ అని తేలడంతో ఆమె తన డబ్బు తిరిగి ఇచ్చెయ్యాలని అడిగింది. మొదట డబ్బు ఇవ్వను అంటూ మొండికేసిన కిరణ్ కుమార్ ఈనెల మొదటి వారంలో ఆమెను కలిసి విడతల వారీగా రూ.16లక్షలు తిరిగి ఇస్తానని ఒప్పుకున్నాడు. అప్పటి నుంచి డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలు నాగోల్ పోలీ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



చాతుర్మాస్య దీక్ష ప్రారంభిస్తున్న కుర్తాళ సిద్దేశ్వరి పీఠాధిపతులు జగద్గురువులు సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి

కాశీ క్షేత్రంలో చాతుర్మాస్య దీక్ష ప్రారంభం

ఎల్‌బీనగర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కుర్తాళ సిద్ధేశ్వరి పీఠాధిపతులు జగద్గురువు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి ఆదివారం ప్రసిద్ధ కాశీ పుణ్యక్షేత్రంలో చాతుర్మాస్య దీక్షను ప్రారంభించారు. పీఠ పురోహితులు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేదవ్యాస మహర్షి పూజ, సిద్ధగురు పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారు భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కాలభైరవుడి అనుగ్రహం లేనిదే ఎవరు కూడా కాశీకి రాలేరన్నారు. భక్తులందరూ కాశీ క్షేత్రంలో ధ్యానం చేయాలని తపస్సు, దీక్షలు చేయాలన్నారు. శ్రీశక్తి పీఠాధిస్వరి మాతాజీ రమ్యానంద భారతి స్వామి గురు విశిష్టతను తెలిపారు. గురువును వేడుకుంటే అన్ని సమస్యలు తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాతాజీ రమ్యానంద భారతి స్వామిని, మోచెర్ల శశిభూషన్, అద్వైతానందస్వామి, లలితానంద భారతి స్వామి, వాసుదేవానంద భారతిస్వామి, ఆదిత్యానంద భారతి స్వామి, పరమ శివానంద భారతి స్వామి, నారాయణానంద భారతీ చిట్టిబాబు పాల్గొన్నారు.

చాణక్యపురి ప్లాట్ ఓనర్లు ఐక్యంగా పోరాడాలి

- అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు

సరూర్‌నగర్: బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని చాణక్యపురి ప్లాట్ ఓనర్లందరూ ఏకతాటిపై ఉండి తమ ప్లాట్లు కాపాడుకోవడానికి పోరాడాల్సిన అవసరం ఉన్నదని ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ.వేణుగోపాల్‌రావు అన్నారు. ఆదివారం నాదర్‌గుల్‌లోని బీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఇక్కడి ప్లాట్ల కోసం పోరాటం చేస్తున్నామని, ప్రభుత్వం లేనిపోని కొర్రీలు పెట్టి తమను వేధిస్తున్నదని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో అనేక మంది ప్రజా ప్రతినిధులను, అధికారులను కలిసి సమస్యను వివరించామని, ప్రస్తుత ప్రభుత్వంలోని నాయకులను సైతం అదే తరహాలో కలిసి సమస్యను వివరించి పరిష్కారం కోసం ప్రయత్నించాల్సిన అవసరం ఉన్నదని ఆయన అన్నారు. ప్లాట్లు కాపాడుకోవడానికి చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుని ఆ దిశలో ఉద్యమించడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని ఆయన సూచించారు.

అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

చాణక్యపురి ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం నాటి సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీ.వేణుగోపాల్‌రావు, ఉపాధ్యక్షులుగా విష్ణుమూర్తి, సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వీ.శ్రీరాములు, కోశాధికారిగా ఎ.బాబూరావు, సలహాదారుడిగా ఎల్.బుచ్చిరెడ్డి, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోడ్డును తవ్వారు.. మరమ్మతులు మరిచారు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, కాలనీవాసులు

వనస్థలిపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రోడ్డుకు ఇరువైపులా వాణిజ్య సముదాయాలతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు రోడ్డు జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం పనులతో ట్రాఫిక్ సమస్యలు మరింతగా పెరిగాయి. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని రెడ్ వాటర్ ట్యాంక్ నుంచి వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం పనులు పదిహేను రోజుల క్రితం అధికారులు ప్రారంభించారు. ఈ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఐదుమీటర్ల వరకు బీటీ రోడ్డు తవ్వి వదిలేశారు. దీంతో ప్రధాన రహదారి ఇరుకుగా మారడంతో వనస్థలిపురం నుంచి బీఎన్‌రెడ్డినగర్‌కు వాహనదారులు ప్రమాదకర పరిస్థితిల్లో తమ ప్రయాణాలు సాగిస్తున్నారు. తవ్విన చోట గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



బీఎన్‌రెడ్డినగర్ నుంచి వనస్థలిపురం వెళ్లే ప్రధాన రహదారి

వర్షం కురిసిన ప్రతిసారి వరదనీరు నిలవడంతో స్థానికులు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయకుండా సంబంధిత కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో చోద్యం చూస్తుండడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. అనేక కాలనీలకు ప్రధాన రహదారి కావడంతో అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డును తవ్వి వదిలేయడంతో అటుగా వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం పనులతో రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాలు ఉన్న నేపథ్యంలో షాపుల్లోకి వచ్చే కష్టమర్లకు వాహనాల పార్కింగ్ పెట్టుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయని పలువురు వ్యాపారులు వాపోయారు. రాత్రి వేళలో ఈ రోడ్డుపై ఇతర ప్రదేశాల నుంచి వచ్చే కొత్త వారికి రోడ్డును సరిగా అంచనా వేయకపోవడంతో ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయని కాలనీవాసులు పేర్కొన్నారు. రోడ్డు పనులను సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ త్వరితగతిన పూర్తిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. లేనిపక్షంలో కాలనీవాసులందరం కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



రెడ్‌వాటర్ ట్యాంక్ నుంచి బీఎన్‌రెడ్డినగర్ వెళ్లే ప్రధాన రహదారి

త్వరితగతిన పనులు చేపట్టాలి



రెడ్ వాటర్ ట్యాంక్ నుంచి వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా చేపడుతున్న జంక్షన్ ఇంప్రుమెంట్ ప్రోగ్రాం పనులు త్వరితగతిన చేపట్టాలి. రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలి.

- మొద్దు లచ్చిరెడ్డి బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్

నాణ్యతా లోపంతోనే పనులు ఆలస్యం

జంక్షన్ ఇంప్రుమెంట్ ప్రోగ్రాం పనుల్లో భాగంగా ఇక్కడికి తీసుకవచ్చిన కర్బ్ స్టోన్స్ స్ట్రెంత్ టెస్ట్ చేయిస్తే కొద్దిగా తక్కువగా రావడంతోనే పనులు ఆలస్యం అవుతున్నాయి. సరిపడా కర్బ్ స్టోన్స్ స్ట్రెంత్ వచ్చాకే పనులను చేపడతాం. అందుకు ప్రజలు సహకరించాలి. - దామోదర్ డీఈ